# ఒ ప్పు

తై మోడ్పు కనులతో కూర్చునివుంది మాధవి.

ఆమె మనసునిండా రవి గురించిన ఆలోచనలే! అతనిమీద ప్రేమారాధనతో హృదయం వుక్కిరిబిక్కిరవుతోంది.

ఒడ్డున కూర్చుని సముద్రాన్నే తిలకిస్తున్న ఆమె ఆలోచన్లు సముద్రంలోని అలలకన్నా వువ్వెత్తున ఎగిసిపడుతున్నాయి.

రవి ఇంకా ఎందుకు రాలేదూ?

ఒకవేళ వాళ్ళింట్లోవాళ్ళు తనతో పెళ్ళికి వప్పుకోలేదేమో!

వప్పుకోకపోతే తానేం చెయ్యాలి?

సరిగ్గా నెలరోజుల్క్రితం రవి ఎవరో తనకి తెలీదు. ఇవాళ అతని మీదే తన భవిష్యత్తు ఆధారపడివుంది! విచిత్రంగా అనిపించింది మాధవికి.

చిన్న పడవలో చేపలు పట్టడానికి బయల్దేరుతున్నారు కొందరు.

"నువ్వెందుకయ్యా వత్తావు?....''ఓ ముసలివాణ్ణి వద్దని వారించారు మిగతావాళ్ళు.

''మా నాడు పెద్దయి సేతికంది వచ్చేంతవరకూ తప్పదు. నే నియాల ఆడికి పెడితేనేకదా ఆడు రేపు నాకు పెట్టేది....!'' ముసలతను బలవంతాన మిగతావాళ్ళతో వేటకు బయల్దేరాడు.

తాము తెచ్చుకున్న ఆహారాన్ని ముక్కుల సాయంతో పిల్లల ముక్కుల్లోకి కూరే తల్లికాకులు గుర్తుకొచ్చాయి మాధవికి.

ఒక పెద్ద కెరటం ఆమె పాదాలదాకా వచ్చి కాళ్ళని తడిపి, వెనక్కి వెళ్ళిపోయింది. తన ఆలోచనల్లోంచి వులిక్కిపడి బయటి కొచ్చింది మాధవి. దూరంగా వస్తూ రవి కనిపించాడు.

ఆమెలో ఆనంద కెరటం వువ్వెత్తున ఎగసిపడసాగింది.

అక్కడికి చేరుకున్న రవి ఆమె ప్రక్కనే ఇసుకలో కూలబడ్డాడు.

దిగులుగా వున్న అతడి ముఖాన్ని చూడగానే ఆమెకి విషయం చాలావరకు అర్థమైనట్లు అనిపించింది. ఆనందం ఆవిరై పోయింది.

"మా వాళ్ళు మరీ ఛాందసులు మధూ!.... కులపట్టింపు ఎక్కువ. నే నెంతగా నచ్చచెప్పాలని ప్రయత్నించినా వాళ్ళు వినిపించుకోవడం లేదు...."

మాధవి కళ్ళు చెమ్మగిల్లాయి.

"నువ్వు కంటనీరు పెట్టుకోకు మధూ!....మా అమ్మా నాన్నే కాదు- ప్రపంచమంతా కాదన్నా మన పెళ్ళి ఆగేదిలేదు. వాళ్ళందర్నీ వదులుకు నైనా సరే- నిన్ను నా దాన్నిగా చేసుకుంటాను!"

హఠాత్తుగా ఆమె కళ్ళ ముందు ఇందాక చేపల వేటకి అందరూ వద్దన్నా బయల్దేరిన ముసలాయన మెరిసాడు. అతని మాటలు గుర్తు కొచ్చాయి.

"సారీ రవీ!.... ముప్పైఏళ్ళు కనిపెంచిన తల్లిదండ్రుల్ని నిన్న గాక మొన్న పరిచయమైన నాకోసం వదులుకోవడానికి వెనుకాడని నువ్వు, రేపు నన్ను జీవితాంతం కాపాడతావని నమ్మకమేమిటి? నువ్వు నీ వాళ్ళం దర్నీ నాకోసం వదులుకోవడానికి సిద్ధంగా వున్నా, నిన్ను పెళ్ళి చేసు కోవడానికి నేను సిద్ధంగా లేను. నువ్వు చేసేది తప్పోగాదో చెప్పలేనుగాని, నేను చేసేది ఒప్పే!" తన కన్నీళ్ళతని ముందెక్కడ బయటపడతాయోనని ఆమె గబగబా అక్కడినుంచీ కదిలింది. రవి స్థాణువై పోయాడు.

(ఈ వారం వారపత్రిక)